# "నో వేకెన్సీ"

రచయిత :
కాంచనపల్లి వేంకటరంగారావు

[అదృష్టం అనేది ఒకరిసొమ్ముకాదు. ఒక్కొక్కడు పుట్టిందిమొదలు చచ్చేపర్యంతం దర్జాగానే జీవితం వెళ్ళిస్తాడు. ఒక్కొక్కడిజీవితం దీనికి సరిగ్గా వ్యతిరేకం. మధ్యలో బాగుపడి, మధ్యలోనే మాసిపోయినవారుకూడా వున్నారు. కాని యే అదృష్టం దురదృష్టంఅయినా పెళ్ళికాకుండా, పిల్లలులేకుండావుంటే ఆ దారివేరు. సంసారంతోటి దారివేరు]

పాపం వెంకటేశం యెన్నికష్టాలో పడి యెలాగో చదువు అయిందనిపించాడు గుమస్తాగిరీకి సరిపోయేపాటి. ఈలోగా తల్లిదండ్రులు చనిపోయారు. భార్యా కాపరానికి వచ్చింది. ఒకరికి యిద్దరు అయారు. ముగ్గురు కాకుండానే వుద్యోగం కోసం వెతకడం ప్రారంభించాడు. కాని ముగ్గురు సంతానం కలిగేపర్యంతం ప్రయత్నించినా ఆ పాటువుద్యోగం యెక్కడా దొరికిందికాదు.

పెట్టవలసిన ఆఫీసులకన్నీ అర్జీలు పెట్టాడు.

చూడవలసిన అధికారుల నందరినీ చూశాడు.

మ్రొక్కవలసిన దేముళ్ళకల్లా మ్రొక్కాడు.

జ్యోతిష్కులతో ఆలోచించాడు.

కనపడ్డ సాముద్రికుడికల్లా అరచేయి అందిచ్చాడు.

ఎవరు యేమిచెప్పితే అది సంసారము పోషించేనిమిత్తము, వుద్యోగ సేకరణకు చేస్తూవచ్చాడు. చేతులోవున్న ఆ కాస్త డబ్బు అయిపోయింది. భార్యాపిల్లలు పంజరాలలాగున తయారుకాజొచ్చారు.

పెట్టిన ప్రతి అర్జీమీద మరేరిమార్కు చేతకానట్టు "I am sorry—There is no Vacancy" అనే మాటేగాని మరో క్రొత్త జవాబులేదు. అప్లికేషన్లు వ్రాసే విధానం అలవాటైందేగాని, వుద్యోగము దొరికే మార్గము కనిపించిందిగాదు. ఇంటికి వెళ్ళడము భయమైపోయింది. భార్యా బిడ్డల ఘోష చూడలేకపోయాడు. అఫీసు వుద్యోగాలు యిఖ దొరకవు అని నిశ్చయించుకొని, మిలిటరీ సర్వీసుకోసము ప్రయత్నించాడు ఆఖరుదఫాగా. దానికీకూడా ఆ అధికారులు "You have no physique.... You are weak a frail....unfit....I am awfully sorry" అనే రిమార్కులతో త్రోసిపారేశారు.

ఇంకేం చేస్తాడు? గత్యంతరము కనిపించడములేదు. అప్పటికప్పుడే వారము

(తరువాయి 63 వ పేజీలో)

(22 వ పేజీ తరువాయి)

రోజులై తిండిలేదు. కళ్లు లోతుకుపోయాయి. శరీరము వెలవెలపోతోంది. నడిచే శక్తి కూడా నసించింది. వెర్రివాడివలె రోడ్డు మీద చిరిగినకోటుతో. చెదర క్రాపుతో, వివర్ణ వదనముతో, క్షీణించిన శరీరముతో, రద్దీగావున్న ఆ రోడ్డుమీద ఏమీ ఆలోచనా లేక వెర్రివాడివలె తిరుగుతున్నాడు.

ఈ పరిస్థితిలో కుటుంబము ఒక్క-సారిగా నాశనానికివచ్చారు. తన చేతకానితనానికి దుఃఖించాడు. మిలిటరీ అధికారులు చేసిన కడపటి రిమార్కు "unfit-unfit" అనేది పదేపదే తలపుకువస్తోంది.

'నాకు యీ ప్రపంచం unfit-ప్రపంచానికి నేను unfit- కాని unfit నైన నేను యీ unfit ప్రపంచానికైనా fit కాకపోతానా' అనే ఆలోచనచేస్తూ పోవవచ్చి నడిరోడ్డుమీద పడిపోయాడు కళ్లు తెలియకుండా.

అడ్డు ఆపులు లేకుండా రోడ్డు తమ కోసమే వేయబడినట్లు full speed మీద ఒక మిలిటరీలారీ వస్తోంది. బ్రేక్ వేసేప్రయత్నము ఆ డ్రైవరైతే చేశాడు కాని వెంకటేశాన్ని దాటినతర్వాతగాని ఆ break పడిందికాదు. నీవు యీ ప్రపంచానికి unfit-గనుక బ్రతికి లాభంలేదు. అనేమాటను మిలిటరీలారీ ధృవపరిచింది. అంతటితో వెంకటేశానికి యీ unfit ప్రపంచంతో సంబంధం వదిలిపోయింది.

* * *

ఎవరు చేసుకున్నది వారు అనుభవించకతప్పుతుందా? కర్మపరిపాకం అయిపోయింది నేటితో అన్నారు. వృద్ధజంబుకాలు తమ కర్మ యెలాగుందో తెలుసుకోలేక.

మన వెధవసంఘములో యెటువంటి సానుభూతీలేదండి. తిండికి లేక మలమల మాడుతూవుంటే చూస్తూ వూరుకుంటుందే గాని పాడుసంఘం పిడికెడు ముష్టివెయ్యదు అన్నారు. సంఘసంస్కారులు తామేమిటో వూడబొడిచినట్లు.

* * *

పత్రికలవాళ్లు ''ప్రమాదం accident అంటూ వార్త ప్రచురించి అంతటితో తమ డ్యూటీ అయిందనిపించుకున్నారు. కాని అసలు సంగతి యేవరికీ తెలియదు.

కథాంజలి

అన్ని హిగ్గిన్ బాథమ్సు బుక్ స్టాల్సు లోను దొరకును. వెల 0-2-0